# సాక్షి
# కామారెడ్డి

శనివారం । 25 । మార్చి । 2023






## మెమోలు ఇవ్వండి

సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమోలు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ ఎంపీడీవోను ఆదేశించారు.

- 9లో ▸

## రంజాన్ వేళలు

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| శని : 6:34 | ఆది: 4:54 |

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.7 /17.3

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### 'జోడో యాత్ర' వాయిదా

నిజాంసాగర్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఆదివారం జుక్కల్ నియోజకవర్గంలో యాత్ర నిర్వహించాల్సి ఉంది. యాత్రను వచ్చే నెల 6 వ తేదీకి వాయిదా వేసినట్లు జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 6,513 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 181 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పరీక్షలను పర్యవేక్షించారు.

### 4,810 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో శుక్రవారం కంటి వెలుగులో 4,810 మందికి పరీక్షలు నిర్వహించారు. 493 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 2,43,712 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 38,691 మందికి కంటి అద్దాలను అందించామని అధికారులు తెలిపారు.

### 'క్షయ నిర్మూలన అందరి బాధ్యత'



కామారెడ్డి క్రైం: క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. క్షయ లక్షణాలు కనిపించగానే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పాజిటివ్ వస్తే క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. క్షయ వ్యాధి అంతానికి అందరితో కలిసి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, వైద్యుడు నవీన్, ప్రోగ్రాం అధికారి రాధికా రాణి తదితరులు పాల్గొన్నారు.

### 'పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలి'



మద్నూర్: నిరుపేదలకు ప్రభుత్వం పక్కా ఇళ్లు కేటాయించాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార డిమాండ్ చేశారు. హండేకేలూర్ గ్రామంలో అనర్హులకు ఇళ్లు మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె హండేకేలూర్ గ్రామస్తులు, సర్పంచ్ నీలావతితో కలిసి తహసీల్ కార్యలయానికి తరలివచ్చారు. అర్హులకు ఇళ్లు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

**ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం**

మద్నూర్ నుంచి బోధన్ వరకు జాతీయ రహదారి 161బీబీ మంజూరు చేసిన సందర్భంగా శుక్రవారం మద్నూర్‌లో ప్రధాని మోదీ, మంత్రి గడ్కరీల ఫొటోలకు పాలాభి షేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, మండల అధ్యక్షుడు హన్మండ్లు, నాయకులు పాల్గొన్నారు.

### 'ఓటుతో బీజేపీకి బుద్ధి చెప్పాలి'




కామారెడ్డి టౌన్: రాబోయే ఎన్నికల్లో ఓటుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.రమ పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర శుక్రవారం కామారెడ్డికి చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. నల్లధనం తీసి పేదల బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పి మోదీ వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. పేదల సంక్షేమాన్ని గాలికి వదిలేసి ఆదానీ, అంబానీలకు ఊడిగం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జన చైతన్య యాత్ర నాయకులు జాన్ వెస్లీ, రమణ, సాగర్, ధర్మ నాయక్, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు మోతీరాం నాయక్, చంద్రశేఖర్, అరుణ్ పాల్గొన్నారు.



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న భక్తులు

## శోభాయమానం

హనుమాన్ భక్తులు శుక్రవారం మహా పాదయాత్ర నిర్వహించారు. జుక్కల్ మండలం కేంరాజ్ కల్లాలి గ్రామ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు సుమారు 24 కిలోమీటర్లు సాగింది. భక్తులు కోలాటం ఆడుతూ, భజనలు చేస్తూ ముందుకు సాగారు. దారి పొడగునా రామనామం మారుమోగింది. ఏటా తమ గ్రామంనుంచి సలాబత్‌పూర్ వరకు మహా పాదయాత్ర చేస్తామని కేంరాజ్ కల్లాలి సర్పంచ్ రమేశ్ దేశాయ్ తెలిపారు. సలాబత్‌పూర్ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ గురుస్వామితోపాటు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. నిజాంసాగర్

## రైల్వేలైన్ విద్యుదీకరణ పూర్తి

- త్వరలో ప్రారంభించే అవకాశం
- డబ్లింగ్ చేయాలని కోరుతున్న ప్రయాణికులు



సాక్షి, కామారెడ్డి: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్ –నిజామాబాద్ స్టేషన్ల మధ్య రైల్వే లైన్ విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. దీంతో విద్యుత్‌తో నడిచే రైళ్లను ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ నుంచి కామారెడ్డి, నిజామాబాద్ మీదుగా బాసర వరకు రైల్వే లైన్ విద్యుదీకరణ చేపట్టేందుకు 2015–16 ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరు చేశారు. మనోహరాబాద్ నుంచి కామారెడ్డి వరకు 67.3 కిలోమీటర్ల మేర లైను విద్యుదీకరణ పనులు గతేడాది చివరలో పూర్తయ్యాయి. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వరకు 52 కిలోమీటర్ల రైల్వే లైను పనులు ఇటీవలే పూర్తయ్యాయి. నిజామాబాద్ నుంచి బాసర వరకు పనులు సాగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్, నాందేడ్ డివిజన్ల మధ్య విద్యుత్‌తో నడిచే రైలు ఇంజన్లు పరుగులు పెట్టనున్నాయి.

**డబ్లింగ్ చేస్తే..**

మొదట మీటర్ గేజ్ రైల్వేలైన్ ఉండగా.. తర్వాతి కాలంలో బ్రాడ్ గేజ్‌గా అభివృద్ధి చేశారు. విద్యుదీకరణ కూడా పూర్తయ్యింది. ఇక మిగిలింది డబ్లింగ్ పనులే.. మనోహరాబాద్ –కామారెడ్డి – నిజామాబాద్ మధ్య డబ్లింగ్ పనుల కోసం గతంలో సర్వే నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఇప్పటి వరకు డబ్లింగ్‌కు నిధులు మంజూరు కాలేదు. డబ్లింగ్ అయితే రైళ్లలో ప్రయాణం మరింత సులువు అవుతుంది. డబ్లింగ్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### సింగిల్ లైన్‌తోనే సమస్య..

సికింద్రాబాద్, కాచిగూడల నుంచి కామారెడ్డి మీదుగా నిజామాబాద్, నాందేడ్ రూట్‌లో నిత్యం 55 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు, కామారెడ్డి నుంచి నిజామాబాద్, నాందేడ్, ముంబయి తదితర ప్రాంతాలకు నిత్యం వేలాది మంది ప్రజలు రైళ్లలో ప్రయాణిస్తుంటారు. రైల్వే విద్యుదీకరణ పూర్తై విద్యుత్ ఇంజన్లను ప్రవేశపెడితే రైళ్ల వేగం పెరిగే అవకాశం ఉంది. అయితే మనోహరాబాద్ నుంచి నిజామాబాద్ వరకు సింగిల్ లైన్ ఉండడం సమస్యగా మారింది. రైళ్ల సంఖ్య పెరగడం, గూడ్స్ రైళ్లు కూడా ఎక్కువగా తిరుగుతుండడంతో రాకపోకలకు తీవ్ర ఆటంకాలు కలుగుతున్నాయి. క్రాసింగులతో ప్రతి రైలును ఏదో ఒక స్టేషన్‌లో కాసేపు నిలపాల్సి వస్తోంది. కొన్ని రైళ్లను అరగంట పాటు కూడా నిలిపివేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

## బాధ్యతగా పనిచేయండి

- అర్హులకు పథకాలు అందేలా చూడండి
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ దఫేదార్ శోభ



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శోభ

కామారెడ్డి అర్బన్: శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతున్నందున అధికారులు మరింత బాధ్యతగా ప్రజలకు సేవలు అందించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ సూచించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్‌లో గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆర్థిక, ప్రణాళిక, పనులు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ అర్హులైన వారికి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికారులతో వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దేవాదాయ శాఖ అధికారులు ప్రజాప్రతినిధులను అవమానపరిచేలా వ్యవహరిస్తున్నార ని కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మజీద్ ఆరోపించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల జిల్లా అధికారి మండల సర్వసభ్య సమావేశాలకు హాజరై ఆయా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని చైర్‌పర్సన్ శోభ సూచించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కామారెడ్డి ఆర్టీసీ డిపోకు 8 సూపర్ లగ్జరీ బస్సులు మంజూరయ్యాయని డీఎం తెలిపారు. వారం రోజుల్లో వాటిని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో నిర్మించిన కంపోస్ట్ ఎరువుల షెడ్డులను వినియోగంలోకి తేవాలని డీపీవోకు సూచించారు. ఉపాధి హామీ పథకంలో రెండు నెలలపాటు ఎక్కువ మందికి పని కల్పించాలని డీఆర్‌డీవోను ఆదేశించారు. వైకుంఠధామాల వద్ద నీటి ఎద్దడి నివారణకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద మంజూరు తీసుకోవాలని సూచించారు. సమావేశాల్లో రాజంపేట, నాగిరెడ్డిపేట, మద్నూర్, లింగంపేట జెడ్పీటీసీ సభ్యులు కొండా హన్మాండ్లు, మనోహర్‌రెడ్డి, అనిత, శ్రీలత, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న స్పీకర్ పోచారం

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- అయ్యప్ప ఆలయంలో సన్నిధానం నిర్మాణానికి భూమిపూజ

బాన్సువాడ టౌన్: ఆలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద రూ.30 లక్షలతో చేపట్టిన సన్నిధానం నిర్మాణానికి శుక్రవారం భూమి చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఒక్క బాన్సువాడ పట్టణంలోనే ఆలయాల అభివృద్ధికోసం ఇప్పటివరకు రూ. 7 కోట్ల నిధులు కేటాయించామన్నారు. బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లీ అక్రెడిటేషన్‌కు ఎంపికైన బాన్సువాడ ఎంసీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని త్వరలో మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా సన్మానించనున్నట్లు తెలిపారు. అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్పీకర్ పోచారం, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, ఆర్డీవో రాజాగౌడ్, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు శంకర్, గురువినయ్, విఠల్‌రెడ్డి, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్‌గౌడ్, నాగరాజు, సాయిలు, నాయకులు గంగాధర్, అంజిరెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, మోహన్‌నాయక్, శ్రీనివాస్, కిరణ్, వెంకటేష్, నర్సగౌండ, లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పరీక్షలు చేస్తున్నాం

- కంటి వెలుగును పర్యవేక్షిస్తున్నాం
- వీసీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: మహిళా ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. అవసరమైన వారికి మందులు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కంటి వెలుగు శిబిరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. జీవో నంబర్ 58 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులకు పట్టాలు అందిస్తున్నామన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల మంజూరు చేయడానికి ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హులైన వారిని గుర్తించి పోడు పట్టాలు అందించే ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వేసవికాలం సమీపిస్తున్నందున జిల్లాలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. పల్లె ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల లక్ష్యాలను సాధించే దిశగా అధికారులతో కలిసి కృషి చేస్తున్నామన్నారు. డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలలో అన్ని సౌకర్యాలు కల్పించి వినియోగించుకునే దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఆయిల్‌పాం సాగు పెంచే దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేశామన్నారు.

## ఘనంగా సాక్షి వార్షికోత్సవం



డిచ్‌పల్లి మండలం గాంధీనగర్‌లోని 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో శుక్రవారం 'సాక్షి' దినపత్రిక 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. – డిచ్‌పల్లి

## కేటీఆర్‌ను కేబినెట్‌నుంచి తొలగించాలి

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలో మంత్రి కేటీఆర్‌ను మంత్రి పదవి నుంచి తొలగించాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై శుక్రవారం కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. సీఎం కేసీఆర్ ఉద్యోగ నోటిఫికేషన్‌లు వేస్తే.. ఆయన కొడుకు కేటీఆర్ లీకేజీలు చేస్తున్నాడని, కూతురేమో లిక్కర్ స్కాంలో ఉందని విమర్శించారు. ప్రశ్న పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి అనిత రామచంద్రన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్–1 పేపర్ కూడా రద్దు చేయాలన్నారు. పరీక్షలు రాసిన వారందరికీ రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందించాలన్నారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగుల ఆగమవుతుంటే లిక్కర్ స్కాం నుంచి ఎమ్మెల్సీ కవితను కాపాడుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకుని వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్, నాయకులు చందు, శ్రీనివాస్, భీంరెడ్డి, చీమర్ల సుధీర్, రాజశేఖర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## దమ్ముంటే నీ ఆస్తులు వెల్లడించు

- షబ్బీర్‌అలీకి ప్రభుత్వ విప్ గంప సవాల్
- తప్పుడు ఆరోపణలు చేస్తే గుణపాఠం తప్పదని హెచ్చరిక



మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: ఆరోపణలు చేయడం కాదని, దమ్ముంటే వాటిని నిరూపించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మాజీ మంత్రి షబ్బీర్ అలీకి సవాల్ విసిరారు. శుక్రవారం కామారెడ్డి సమీపంలోని పొందుర్తి శివారులోగల ఓ ఫామ్ హౌస్‌లో బీఆర్‌ఎస్ మాచారెడ్డి మండల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు ఇటీవల హాథ్ సే హాథ్ జోడో యాత్రలో తనపై చార్జిషీట్ విడుదల చేశారని, అందులో అన్నీ తప్పుడు ఆరోపణలేనని పేర్కొన్నారు. పొందుర్తి చెక్ పోస్ట్ వద్ద కార్యకర్తలను పెట్టి డబ్బులు వసూలు చేస్తానని తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలన్నారు. మంత్రిగా పనిచేసి రూ. వెయ్యి కోట్ల ఆస్తులు సంపాదించుకున్న ఘనత షబ్బీర్ అలీదన్నారు. ''నా ఆస్తుల వివరాలను గత ఎన్నికల సమయంలో గాంధీ గంజ్‌లో చెప్పాను. మరోసారి చెప్పడానికీ సిద్ధంగా ఉన్నా. నీ ఆస్తులు, నీ తమ్ముడు, నాయకుల ఆస్తులు బయట పెట్టు'' అని షబ్బీర్ అలీని డిమాండ్ చేశారు. ఇద్దరి ఆస్తులను నియోజకవర్గ ప్రజలకు పంచుదామా అని సవాల్ చేశారు. తన ఆస్తులను ప్రజలకు ఇచ్చి, మళ్లీ గంప గోవర్ధన్‌గా బస్వాపూర్‌లో బతకగలనని, కానీ తప్పుడు పనులు మాత్రం చేయనని పేర్కొన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, ఎంపీపీ నర్సింగ్ రావు, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, నాయకులు వెంకటి, రాంరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మున్సిపాలిటీ టెక్నికల్ ఆఫీసర్‌పై ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలలో సాఫ్ట్‌వేర్ టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న దేశ్‌ముఖ్‌పై శుక్రవారం రెవెన్యూ అధికారులు మున్సిపల్ కమిషనర్ చిత్రామిశ్రాకు ఫిర్యాదు చేశారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట కాలనీలో ఓ ఇంటికి అక్రమంగా రూ. 25వేల ఇంటి ట్యాక్సీ కట్టకున్నా.. కట్టిన్నట్లు రశీదు ఇవ్వడానికి ప్రయత్నించారు. ఇదే విషయమై చెల్లింపులో తేడా రావడంతో రెవెన్యూ అధికారులు ఆరా తీశారు. ఏం జరిగిందో తెలుసుకొని విచారించగా గ్లోబత్ కంపెనీ నుంచి జిల్లాలో ఉన్న మున్సిపాలిటీలో సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తితే, సమస్య పరిష్కరించే ఉద్యోగి దేశ్‌ముఖ్ అక్రమాలకు పాల్పడే ప్రయత్నం చేశాడన్నారు. దీంతో అతడిపై ఫిర్యాదు చేసిన్నట్లు తెలిపారు.

### బాల్య వివాహం అడ్డగింత

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో శుక్రవారం జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో 12ఏళ్ల బాలికకు వివాహం చేస్తున్నట్లు ఐసీడీఎస్ చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందగా.. అధికారులు గ్రామానికి చేరుకొని వివాహన్ని నిలిపివేశారు. అనంతరం బాలిక కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ అందించారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

ఖలీల్‌వాడి: నిజామాబాద్ బార్ అసోసియేషన్ 2023–24 వార్షిక ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఆశ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా భాగి చరణ్, కోశాధికారిగా బిట్ల రవి, సాంస్కృతిక కార్యదర్శిగా సత్యనారాయణ గౌడ్, లైబ్రరీ కార్యదర్శిగా బాలరాజు నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వెంకట రమణ గౌడ్, శైలేష్ దేశముఖ్ తెలిపారు. సీనియర్ న్యాయవాదుల కోటలో భాస్కరరావు, బిర్లా రామారావు, భిక్షపతి కార్యవర్గ సభ్యులుగా, మహిళ ప్రతినిధిగా వరలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**29న అధ్యక్ష పదవి కోసం పోటీ..**

బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి సీనియర్ న్యాయవాదులు కిరణ్ కుమార్ గౌడ్, దేవదాస్ ఆలాగే సహాయ కార్యదర్శిగా రెంజర్ల సురేష్, మహమ్మద్ అయూబ్ పోటీలో ఉన్నారు. వీరికి ఈ నెల 29 న పోలింగ్ నిర్వహించి, అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

### దుకాణాదారుడిపై ఫిర్యాదు



నిజామాబాద్ సిటీ: నగరంలోని కంఠేశ్వర్ ఆలయ పరిధిలోగల 19వ దుకాణం నిర్వాహకుడు మనీష్‌పై ఆలయ చైర్మన్ మహేష్, ఈవో వేణులు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఆలయ కమిటీ సిబ్బంది నెలరోజుల క్రితం 19వ నంబర్ దుకాణాన్ని తొలగించారు. అయినప్పటికీ దుకాణాదారుడు అక్రమంగా దుకాణం తెరిచి, ఆలయ సిబ్బందిపై దుర్భాషలాడాడు. దీంతో చైర్మన్, ఈవోలు దుకాణాదారుడిపై 3వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.

### కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఇంటర్ పరీక్షల్లో భాగంగా జువాలజీ, హిస్టరీ, మ్యాథ్స్ పరీక్షలు జరిగాయి. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 13,500 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 496 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. శుక్రవారం డీఐఈవో నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# కల్లు కాదు గరళం

- గ్రామాల్లో ఏరులై పారుతున్న కృత్రిమ కల్లు
- ఈత వనాలు లేకుండానే కల్లు విక్రయాలు
- మత్తు పదార్థాలతో తయారీ



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో కృత్రిమ కల్లు ఏరులై పారుతోంది. కల్లు దుకాణ నిర్వాహకులు ఈత చెట్లు లేకుండానే మత్తు పదార్థాలతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. నిత్యం వేల లీటర్ల కల్లు విక్రయిస్తూ రూ.లక్షలు సొమ్ముచేసుకుంటున్నారు. ఆల్ఫ్రోజోలం, డైజోఫాం, కుంకుడు కాయ రసం, తదితర మత్తు పదార్థాలతో కల్లు తయారు చేస్తుండటంతో అది కల్లు కదని, గరళం అని పలువురు పేర్కొంటున్నారు. ఇవేమి తెలియని గ్రామాల్లోని అమాయక ప్రజలు కల్తీ కల్లుకు బానిసలవుతున్నారు.

**మతిస్థిమితం కోల్పోతున్న ప్రజలు..**

మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా కల్లు అమ్ముతున్న మేరకు ఈత వనాలు లేవు. కానీ వేలాది లీటర్ల కృత్రిమ కల్లును తయారు చేసి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడక్కడ కొన్ని ఈత వనాలు మాత్రమే ఉన్నాయి. ఆల్ఫ్రోజోలం, డైజోఫాం వంటి మత్తుపదార్థాలకు తోడు నురుగు కోసం కుంకుడు కాయల రసంతో కల్లు తయారు చేస్తున్నారు. ఇలాంటి కల్లుకు బానిసలైన ప్రజలు, కల్లు లేకుంటే మానసిక స్థితిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అంటే మత్తు పదార్థాలను ఏమేరకు వినియోగిస్తున్నారో అర్థంచేసుకోవచ్చు.

**చూసీచూడనట్లుగా అధికారులు..**

మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో 8 గిరిజన తండాలు ఉన్నాయి. గతంలో మండలానికి అవసరమైన కల్లును డిపోలో తయారు చేసి గ్రామాలకు సరఫరా చేసేవారు. కానీ మూడేళ్లగా ప్రతి గ్రామంలోని డిపోల్లోనే కల్లు తయారీని కొనసాగిస్తున్నారు. కృత్రిమంగా కల్లును తయారు చేసి విక్రయిస్తున్నా.. ఎక్సైజ్, పోలీస్ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనికితోడు వీడీసీలకు ప్రతినెలా మామూళ్లు చెల్లిస్తుండటంతో వారు కూడా పట్టించుకోవడంలేదు. వీడీసీలకు ఏడాదికి రూ.6 లక్షల నుంచి రూ.10లక్షల వరకు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా కల్లు సీసా ధర ఇష్టారీతిన పెంచుకుంటూ ప్రజల నెత్తిన భారాలు వేస్తున్నారు. సీసా ధర రూ.10లకుపైనే ఉంది. బోర్గాం(పి) నుంచి మంచిప్ప వరకు, కులాస్‌పూర్ నుంచి న్యాల్‌కల్ వరకు అన్ని గ్రామాల్లో పోటీ పడి కృత్రిమ కల్లు తయారు చేస్తున్నారు. అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. కాగా ఇదేవిషయమై ఎక్సైజ్‌శాఖ అధికారుల వివరణ కోరగా, ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

# గంటపాటు నిలిచిన పీజీ పరీక్ష

- ఎకనామిక్స్ పేపర్‌లో తలెత్తిన సమస్య
- సరిదిద్దిన వర్సిటీ ఉన్నతాధికారులు
- తెయూలో ప్రారంభమైన సెమిస్టర్ పరీక్షలు



గిరిరాజ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తెయూ కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే మూడవ సెమిస్టర్ ఎకనామిక్స్ విద్యార్థులకు నాల్గో సెమిస్టర్ సిలబస్‌కు సంబంధించిన ప్రశ్నాపత్రం అందజేశారు. పేపర్ చూసి కంగుతిన్న విద్యార్థులు ఆయా పరీక్షా కేంద్రాల్లో అబ్జర్వర్ల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. వారు వెంటనే వర్సిటీ పరీక్షల విభాగం అధికారులకు సమాచారమిచ్చారు. జరిగిన పొరపాటును గ్రహించిన వర్సిటీ ఉన్నతాధికారులు ప్రశ్నాపత్రం మార్చి తిరిగి కొత్త పేపర్‌ను ఆయా పరీక్షా కేంద్రాలకు పంపించారు. సుమారు గంటపాటు పరీక్ష నిలిచిపోవడంతో ఎకనామిక్స్ విద్యార్థులకు అదనపు సమయం కేటాయించడంతో పరీక్ష సజావుగా పూర్తయింది.

**1475 మంది విద్యార్థులు హాజరు..**

ఉదయం జరిగిన పీజీ 3వ, 9వ సెమిస్టర్ పరీక్షల్లో 1,585 మంది విద్యార్థులకు గానూ 1,475 మంది హాజరయ్యారని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. క్యాంపస్ ఆర్ట్స్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్థిని సందర్శించి పరీక్షల తీరును పరిశీలించారు. మధ్యాహ్నం జరిగిన పీజీ మొదటి, 5వ, 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 1767 మంది విద్యార్థులకు గానూ 1,628 మంది హాజరయ్యారని గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్ అరుణ సందర్శించారు. పరీక్షల తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట అడిషనల్ కంట్రోలర్ సాయిలు ఉన్నారు.

## పేపర్ లీకేజీ బాధ్యులను శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కారకులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయం నుంచి పెన్‌డ్రైవ్ ద్వారా పేపర్లను కాపీ చేసుకోవడం అంత ఆషామాషీ కాదన్నారు. దీనికి చైర్మన్ జనార్దన్‌రెడ్డి బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మంత్రివర్గం నుంచి ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం చేస్తున్న అవినీతి అక్రమాలను ప్రశ్నించే జర్నలిస్టులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సమాజం నివ్వెరపోతుందన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. షాడో మేయర్‌గా మేయర్ భర్త వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, ఎమ్మెల్యే కనుసన్నల్లోనే అధికారులు పని చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పేదల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన నిరుద్యోగ మహాధర్నాకు జిల్లా నుంచి తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు స్వామి యాదవ్, నారాయణ యాదవ్, యెండల సుధాకర్, శ్రీనివాస్ శర్మ, గంగాధర్, మీసేవ శ్రీనివాస్, రషీద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలో శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు 'పోషణ పక్షం' గోడ పత్రులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 3వరకు పోషణ పక్షం నిర్వహిస్తున్నామన్నారు. అంగన్‌వాడీల్లో చిరు ధాన్యాలపై అవగాహన కల్పించడంతో పాటు రక్తహీనత తగ్గించడానికి కృషి చేయాలన్నారు. మహిళ సంక్షేమ శాఖ పీడీ సుధారాణి, సూపరింటెండెంట్ ఇంద్ర, సీడీపీవో సౌందర్య, అధికారులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనపై తప్పుడు ప్రచారం సరికాదు



బాల్కొండలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి
- బాల్కొండలో బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం

బాల్కొండ: చేయి, పువ్వు గుర్తు సన్నాసులు సీఎం కేసీఆర్ పాలనపై తప్పుడు ప్రచారం చేయడం సరి కాదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంకే ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని, మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు పనిగట్టుకుని తప్పుడుప్రచారం చేస్తున్నారన్నారు. నిజామబాద్ ఎంపీ అర్వింద్ బాండ్ పేపర్‌కు విలువ లేకుండ చేశాడని ఆరోపించారు. జిల్లా ప్రజలకు, రైతులకు మాయ మాటలు చెప్పి ఎన్నికల్లో గెలిచాడన్నారు. సమావేశంలో పాల్గొన్న శాసన మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నాయకులు బద్దం ప్రవీణ్‌రెడ్డి, కోటపాటి నరసింహానాయుడు, మధు శేఖర్ పాల్గొన్నారు.

## పీపుల్స్ యాత్రకు సంఘీభావం



ఖలీల్‌వాడి: హాత్‌సేహాథ్ జోడా యాత్రలో భాగంగా కాంగ్రెస్ శాసనసభ పక్షనేత మల్లు భట్టి విక్రమార్క్ చేపట్టిన పీపుల్స్‌యాత్రకు శుక్రవారం ఆసిఫాబాద్‌లో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి తాహెర్ బిన్‌హందాన్, రాష్ట్ర కిసాన్ కేత్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఆసిఫాబాద్‌లో మల్లు భట్టి విక్రమార్కతో పాదయాత్ర చేశారు. యాత్రలో గిరిజనుల పోడుపట్టాలు, ధరణి సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లతోపాటు ఇతర సమస్యలను మల్లు దృష్టి తీసుకువచ్చారని ఆయన తెలిపారు. నాయకులు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌ల అభివృద్ధికి చేయూత



బండ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

భిక్కనూరు: ముదిరాజుల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం చేయూతను అందిస్తోందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పెద్దమ్మ ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ముదిరాజు కులస్తులు ఆర్థికంగా వెనుకబడిఉన్నారని ఈ విషయమై ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్న రాజేశ్వర్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విఠల్, సర్పంచ్ తున్కి వేణు, ప్రతినిదులు పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రతిభ



చంద్రమోహన్‌ను సన్మానిస్తున్న ఎక్సైజ్ యూనియన్ నేతలు

ఖలీల్‌వాడి: అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు పూణేలో జరిగే అఖిల భారత సివిల్ సర్వీసెస్ అథ్లెటిక్ పోటీలలో చంద్రమోహన్ పాల్గొంటారు. ఈ పోటీలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయనను ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, ఎక్సైజ్ అసోసియేషన్ నాయకులు సన్మానించి రూ.5 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ యూనియన్ అధ్యక్షుడు రవికుమార్, రాజేశ్వర్, సుదర్శన్, భోజన్న, ఉత్తమ్, మంజుల, సంజయ్, సురేష్, దీపక్ పాల్గొన్నారు.

## పెళ్లికావడం లేదని యువకుడి ఆత్మహత్య

మాచారెడ్డి: పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని రత్నగిరిపల్లిలో చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై సంతోష్ కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల మధు(26) కొన్నేళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నాడు. అయినా పెళ్లి కుదరకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. చేను వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన మధు అక్కడే చెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన



కామారెడ్డిలో ట్రెజరీ జిల్లా అధికారికి వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కామారెడ్డి అర్బన్: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న ఉపాధ్యాయులకు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ట్రెజరీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. డీటీఎఫ్, టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ స్టీరింగ్ కమిటీ జిల్లా నాయకులు ఎస్‌సీ ప్రభాకర్, దేవులా, సాయిలు, అనిల్‌కుమార్ మాట్లాడారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిన మూడు నెలలుగా ఎయిడెడ్ టీచర్లకు వేతనాలు అందడం లేదని, సప్లిమెంటరీ వేతనాలు, సెలవు జీతాలు, జీపీఎఫ్ క్లెయిమ్‌లు, పీఆర్సీ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారుఎ. అనంతరం ట్రెజరీ జిల్లా అధికారి సాయిబాబుకు వినతి పత్రం అందజేశారు. 28లోగా హైదరాబాద్‌లో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. బాపురావు, గఫూర్, గంగారాం, గణేష్, సరోజినీ, నళిని, లక్ష్మి, బస్వయ్యఉన్నారు.

సుభాష్‌నగర్: పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్, ట్రెజరీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రం డీటీఓకు అందజేశారు. నాయకులు విజయ్‌కుమార్, రమేష్, బాలయ్య, రాజన్న, సత్యనారాయణ, వెంకట రమణ, గంగాధర్, సాయన్న, రాజారాం, సిరాజ్, రాజేశ్వర్, సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు



## క్రైం కార్నర్

### గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మోపాల్(నిజామాబాద్ రూరల్): మండలంలోని న్యాల్‌కల్‌లోగల మాసాని చెరువులో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం (45) స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మహేష్ శుక్రవారం తెలిపారు. మృతుడు ఒకటి, రెండ్రోజుల క్రితమే చెరువులో పడి ఉండొచ్చని, మృతుడు తెల్ల బనియన్ ధరించినాడన్నారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712659850 (ఎస్ఐ), 87126 59847 (సీఐ)ను సంప్రదించాలని ఎస్ఐ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్నామని తెలిపారు.

### బెహరాన్‌లో పడకల్ వాసి గుండెపోటుతో మృతి



శ్రీనివాస్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన యాటకర్ల శ్రీనివాస్(55) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బతుకుదెరువు కోసం ఏడాది క్రితం శ్రీనివాస్ బెహరాన్‌కు వెళ్లాడు. అక్కడ కంపెనీలో పని చేస్తుండగా ఈ నెల 21న గుండెపోటు రావడంతో శ్రీనివాస్ మృతి చెందాడని బంధువుల ద్వారా ఇంటికి సమచారం అందించారు. శ్రీనివాస్ బెహరాన్ వెళ్లి ఆర్థికంగా ఎదగాలని అనుకున్నాడు. కానీ విధి వక్రీకరించడంతో గుండెపోటుతో మరణించాడు. మృతుడికి భార్య కళావతి, కుమారుడు ప్రవీణ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబీకులు మృతదేహం కోసం ఎదురు చూస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి బైపాస్ చౌరస్తా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని, ఒకరు మృతిచెందారు. వివరాలు ఇలా.. హైదరాబాద్‌కు చెందిన మురుగేష్ (40) కూలిపని చేస్తూ జీవించేవాడు. ఈనెల 27న జక్రాన్‌పల్లిలోని వాళ్ల అత్తమ్మ వారి ఇంట్లో జరిగే మారపండుగ కోసం అతడు నాలుగు రోజుల క్రితం వచ్చాడు. శుక్రవారం మురుగేష్ తమ బంధువులతో కలిసి బైక్‌పై గోవింద్‌పేట్ గ్రామంలో పనికి బయలుదేరాడు. మామిడిపల్లి బైపాస్ చౌరస్తా రాగానే గుర్తు తెలియని వాహనం అతడిని వెనుక నుంచి ఢీకొనడంతో మురుగేష్ మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు పేర్కొన్నారు.

### కుక్కల దాడిలో మేకలు ..

రెంజల్(బోధన్): మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి ఊర కుక్కలు దాడి చేయగా జంలం రవికి చెందిన 5 మేకలు మృదిచెందగా మరో రెండు తీవ్రంగా గాయపడ్డాయి. ఇంటి ముందు గల షెడ్డులో ఉన్న మేకల మందపై కుక్కలు దాడి చేసి పీక్కుతిన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. షెడ్డులోనే 5 మేకలు మృతిచెందగా మరో రెండు కొన ఊపిరితో ఉన్నాయని బాధిత కుటుంబీకులు తెలిపారు. మృతిచెందిన ఒక్కో మేక విలువ రూ.8 నుంచి రూ.9వేల వరకు ఉంటాయని వివరించాడు.

### ఒకరి అదృశ్యం



దూదేకుల మౌలానా (ఫైల్)

కామారెడ్డి క్రైం: లింగంపేట మండలం మోతె గ్రామానికి చెందిన దూదేకుల మౌలానా(29) అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని దేవునిపల్లి ఎస్సై బాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మౌలానా కొద్ది రోజులుగా కామారెడ్డిలోని బీడీ వర్కర్స్ కాలనీలోని బంధువుల ఇంట్లో ఉంటూ మేస్త్రీ పనికి వెళ్లేవాడు. గురువారం ఉదయం పనికి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. అతడి బంధువులు శుక్రవారం చాలా చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి తండ్రి యూసుఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మోపాల్‌లో ఒకరు..**



జగదీష్ (ఫైల్)

మోపాల్: మండల కేంద్రానికి చెందిన గాజుల జగదీష్ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మోపాల్‌కు చెందిన జగదీష్ కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భార్యతో గొడవ జరగడంతో ఈనెల 21న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి అతడి కుటుంబసభ్యులు ఎంతవెతికిన అతడి ఆచూకీ లభించలేదు. అతడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం



ధర్పల్లి (ఇందల్వాయి): ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లి గ్రామ శివారులోని పొలాల వద్ద గల ఆరు ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. అలాగే అందులోని ఆయిల్, కాపర్ వైర్ చోరీ చేశారు. శుక్రవారం రైతుల సమాచారం మేరకు ట్రాన్స్‌కో ఏఈ కేఎస్ఆర్ మూర్తి ఘటన స్థలాలకు వెళ్లి, పరిశీలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ అధికారులు త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని రైతులు కోరారు.

### ఒకరి రిమాండ్



రెంజల్(బోధన్): మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన నగేశ్ అనే యువకుడిని పట్టుకుని శుక్రవారం రిమాండ్ చేసినట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. గతంలో జరిగిన దొంగతనాల్లో అనుమానితుడిగా ఉండటంతో గురువారం రాత్రి దండిగుట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద ద్విచక్ర వాహనం, 15 తులాల వెండి, అరతులం బంగారం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.